సంకల్పం ద్వారా వదిలేసిన అంటే త్యాగం చేసిన వాటిని మరలా ధారణ చేయరు. ఎలాగైతే ఉన్నత కుటుంబీకులు క్రింద పడిపోయిన వస్తువులను తీసుకోరు. అలాగే మీరందరు సంకల్పం ధారణ చేసారు అంటే ఈ వికారాలను బుద్ధి నుండి వదేసారు. పనికిరానివిగా మరియు పాడైపోయినవిగా భావించి ప్రతిజ్ఞ చేశారు, త్యాగం చేశారు, మరియు " ఇది విషం, దీనిని మేం తీసుకోము " అని మాట ఇచ్చారు. మరలా ఏమి చేస్తున్నారు? వదేసిన వస్తువులను, మురికి వస్తువులను, పనికిరాని వస్తువులను, కుళ్ళిపోయిన వస్తువులను మరలా ఎందుకు ఉపయోగిస్తున్నారు? ఏమి ఆట ఆడుతున్నారో అర్థమైందా? అజ్ఞానుల ఆట ఆడుతున్నారు. ఈ ఆటను చూసి బాబాకు దయ మరియు నవ్వు కూడా వస్తుంది. అన్నీ తెలిసిన వారిగా అయితే అయ్యారు కానీ ఇప్పుడు చేసే వారిగా అవ్వాలి. ఇప్పుడు ఏం చేస్తారు? చేసేవారిగా అయ్యే విశేష కార్యక్రమం చేసి చూపించండి. సంకల్పం ద్వారా త్యాగం చేసిన పనికిరాని వస్తువులను సంకల్పంలో కూడా స్వీకరించకండి. ఆలోచించుకోండి మరియు స్వయాన్ని అడగండి నేనెవరిని మరియు ఏమి చేస్తున్నాను అని. వాగ్దానం ఏమి చేశాను మరియు కర్మ ఏమి చేస్తున్నాను? అని. ప్రతిజ్ఞ ఏమి చేసాను మరియు ఏమి నిలుపుకుంటున్నాను అని. మీ స్వమానం, శ్రేష్ఠ స్మృతి, శ్రేష్ఠ జీవితం యొక్క సమర్థ స్వరూపంగా అవ్వండి. ఏం చెప్పారు మరియు ఏమి చేశారు? ఇప్పుడు ఇటువంటి అద్భుతమైన ఆట ఇప్పుడు ఆపేయండి. శ్రేష్ఠ స్వరూపులుగా, శ్రేష్ఠ పాత్రధారులుగా అయ్యి శ్రేష్ఠత యొక్క ఆట ఆడండి. ఇలా సంపూర్ణ ఆహుతి యొక్క సంకల్పం చేయండి అప్పుడే పరివర్తనా కార్యక్రమం పూర్తి అవుతుంది. ఈ కార్యక్రమం యొక్క తారీఖు సంఘటిత రూపంలో నిర్ణయించండి.

**ఈవిధంగా ధృడ సంకల్పధారులకు, సంకల్పం మరియు స్వరూపం యొక్క సమాన మూర్తులకు, అన్నీ తెలిసినవారిగా మరియు చేసేవారిగా ఉండేవారికి, ప్రతి కర్మ ద్వారా స్వయం యొక్క శ్రేష్ఠత మరియు బాబా యొక్క ప్రత్యక్షత చేసే సర్వ శ్రేష్ఠ ఆత్మలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.**

## బాబా సమానంగా సంపూర్ణంగా అయిన దానికి గుర్తులు......7-12-78

సదా సర్వులకు ఉపకారం చేసే బాప్‌దాదా పిల్లలతో మాట్లాడుతున్నారు :-

సదా మీ స్మృతి యొక్క సమర్థత ద్వారా మూడు స్థానాలు మరియు మూడు స్థితులు నిరాకారి, ఆకారి మరియు సాకారి ఈ మూడు స్థితులలో సహజంగా స్థితులవ్వగలుగుతున్నారా?ఎలా అయితే ఆది స్థితి అయిన సాకార స్వరూపంలో సహజంగా స్థితులు అవ్వగలుగుతున్నారో అలాగే అనాది నిరాకారి స్థితి కూడా ఇంత సహజంగా అనుభవం అవుతుందా? ఇప్పుడిప్పుడే అనాది స్థితి మరలా ఇప్పుడిప్పుడే ఆది స్మృతి యొక్క సమర్థత ద్వారా రెండు స్థితులలో సమానత అనుభవం అవ్వాలి. ఇలా అనుభవం చేసుకుంటున్నారా? ఎలా అయితే సాకార స్వరూపం మీదిగా అనుభవం అవుతుంది మరియు స్థితులవ్వటం కూడా సహజంగా అనుభవం చేసుకుంటున్నారు అలాగే మీ అనాది, నిరాకారి స్వరూపంలో,సదా ఒకే అవినాశి స్వరూపంలో స్థితులవ్వటం కూడా సహజంగా ఉండాలి. సంకల్పం చేసిన వెంటనే స్థితులైపోవాలి.

Created by Universal Document Converter

దీనినే బాబా సమానమైన సంపూర్ణ స్థితి లేదా కర్మాతీత స్థితి అంటారు. అంతిమ స్థితికి ఎంత సమీపంగా చేరుకున్నాను? అని స్వయాన్ని అడగండి. ఎంత సంపూర్ణ స్థితికి సమీపంగా వస్తారో అంటే బాబాకి సమీపంగా అవుతారో దానిని అనుసరించే భవిష్య ప్రాలబ్ధంలో కూడా రాజ్యాధికారిగా అవుతారు మరియు వెనువెంట ఆది భక్తి జీవితంలో కూడా సమీప సంబంధంలో ఉంటారు. పూజ్య మరియు పూజారి రెండు జీవితాలలో సాకార బాబాకి సమీపంగా ఉంటారు అంటే మొత్తం కల్పం ఆది ఆత్మ యొక్క సంబంధ సంపర్కాలలో ఉంటారు. హీరో పాత్రధారితో మీకు కూడా రకరకాలైన నామరూపాలతో విశేష పాత్ర ఉంటుంది. ఇప్పటి సంపూర్ణ స్థితికి సమీపంగా అంటే బాప్‌దాదాకి ఎంత సమీపంగా ఉంటామో దాని ఆధారంగా కల్పమంతటి సమీపత ఆధారపడి ఉంటుంది అందువలన ఎంత కావాలంటే అంత మీ కల్పం యొక్క ప్రాలబ్ధం తయారు చేసుకోండి. సమీపతకి ఆధారం శ్రేష్టత. శ్రేష్టతకు ఆధారం - మీ మరజీవా జీవితంలో విశేషంగా రెండు విషయాలు పరిశీలించుకోండి. 1. సదా పరోపకారిగా ఉన్నానా? 2. ఆది నుండి అంతిమం వరకు సదా బాల బ్రహ్మచారిగా ఉన్నానా? అని. మరజీవా జీవితం యొక్క ఆదికాలం నుండి అంటే చిన్నతనం నుండి ఇప్పటి వరకు సదా బ్రహ్మచారిగా ఉండాలి. బ్రహ్మచారి జీవితం అంటే బ్రహ్మబాబా సమానమైన పవిత్ర జీవితం. దీనినే బ్రహ్మచారి లేదా బ్రహ్మచారి అనండి ఆది నుండి అంతిమం వరకు అఖండంగా ఉండాలి. మాటిమాటికి ఖండితం అయిపోతే బాల బ్రహ్మచారి లేదా సదా బ్రహ్మచారి అని అనరు. ఏ రకమైన పవిత్రత అంటే స్వచ్ఛత ఖండితం అయినా పరమ పూజ్యనీయులుగా కాలేరు. బాబా సమానంగా అవ్వని కారణంగా సమీప సంబంధాలలోకి కూడా రాలేరు. అందువలన శ్రేష్టతకు ఆధారం, సమీపతకి ఆధారం బాల బ్రహ్మచారి అంటే సదా బ్రహ్మచారి వీరినే తండ్రిని అనుసరించేవారు అని కూడా అంటారు. కనుక స్వయాన్ని అఖండంగా ఉన్నానా? అని పరిశీలించుకోండి. అఖండంగా ఉండేవారికి సర్వ ప్రాప్తులు కూడా అఖండంగా అనుభవం అవుతాయి. ఖండిత పురుషార్థులకు ప్రాప్తులు కూడా అల్పకాలికంగానే అనుభవం అవుతాయి. సదా స్వచ్ఛంగా ఉందా? అని.మీ రిజిష్టర్‌ని పరిశీలించుకోండి. ఏ రకమైన మచ్చతో రిజిష్టర్‌ను పాడు చేసుకోలేదు కదా? సదా బ్రహ్మచారి అంటే సంకల్పంలో కూడా ఏ రకమైన అపవిత్రత వృత్తి యొక్క చంచలంగా చేయకూడదు. మొదట వృత్తి యొక్క చంచలతయే ఓడిస్తుంది తర్వాత దృష్టి మరియు కర్మ యొక్క చంచలత వస్తుంది. వృత్తి యొక్క చంచలతయే రిజిష్టర్‌పై మచ్చ పడేలా చేస్తుంది అందువలన సదా వృత్తిలో కూడా సదా బ్రహ్మచారిగా ఉండాలి.

ఈరోజు బాప్‌దాదా పిల్లల యొక్క రిజిష్టర్‌ను చూస్తున్నారు. ఎంత మంది పిల్లలు సదా బ్రహ్మచారిగా ఉన్నారు మరియు ఎంత బ్రహ్మచారిగా ఉన్నారు అని. బాల బ్రహ్మచారులకు గొప్పతనం ఉంటుంది. బాల బ్రహ్మచారులు వర్తమాన సమయంలో కూడా పూజ్యులుగా అంటే శ్రేష్టంగా ఉంటారు. బాప్‌దాదా కూడా అటువంటి పిల్లలను పూజ్య రూపంలో చూస్తారు మరియు విశ్వం ముందు కూడా అంతిమంలో పూజ్యరూపంలో ప్రత్యక్షం అవుతారు. బాబా ముందు పూజ్యులుగా ప్రసిద్ధమైనవారు సదా సమీప సంబంధాలలో ఉంటారు. ఇలా మీ రిజిష్టర్‌ని చూసుకోవాలి. రెండవ విషయం పరోపకారం. దీని విస్తారం చాలా గుహ్యమైనది. దీని విస్తారం స్వయం ఆలోచించండి. విశ్వంపట్ల మరియు బ్రాహ్మణులపట్ల రెండు సంబంధాలలో సదా పరోపకారిగా అయ్యారా లేక ఒక్కొక్కసారి స్వ ఉపకారిగా, ఒక్కొక్కసారి పరోపకారిగా ఉన్నారా? వాస్తవానికి

Created by Universal Document Converter

పరోపకారమే స్వఉపకారం. ఈవిధంగా ఈ విషయంలో కూడా మీ రిజిష్టర్‌ను పరిశీలించుకోవాలి తర్వాత బాప్‌దాదా కూడా చెప్తారు. మంచిది.

సదా మీ యొక్క ఆది, అనాది స్వరూపంలో సహజంగా స్థితులయ్యే వారికి, సదా స్వచ్ఛంగా మరియు స్పష్టంగా ఉండే పూజ్య ఆత్మలకు, మొత్తం కల్పంలో సమీప సంబంధాలలోకి వచ్చే ఆత్మలకు, సదా బ్రహ్మచారి పిల్లలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

## విస్తారాన్ని చూడకుండా సారాన్ని అంటే బిందువుని చూడండి. 10-12-78

మధువన నివాసి త్యాగీ, తపస్వీ పిల్లలతో బాప్‌దాదా మాట్లాడుతున్నారు :-

మధువన నివాసీయులు అంటే మధురత అనే సాగరంలో సదా తేలియాడుతూ ఉండేవారు. బాప్‌దాదా యొక్క విశేష కర్మ భూమి, చరిత్ర భూమి, మధుర కలయిక భూమి, మహాన్ పుణ్యభూమి అటువంటి భూమి యొక్క నివాసీయులు ఎంత గొప్ప ఆత్మలు. నిరాకారి బాబాకి కూడా ఈ సాకార భూమి అంటే విశేష స్నేహం ఉంది. అటువంటి భూమి యొక్క నివాసీయులు అయిన మీరు కూడా అలా అనుభవం చేసుకుంటున్నారా? మధువనం అంటే మధుర భూమి. వృత్తిలో కూడా మధురత, మాటలో కూడా మధురత, ప్రతి కర్మలో కూడా మధురత ఉండాలి. భూమి ఎలాంటిదో ఆ భూమిలో ఉండేవారు కూడా అంత మహాన్ ఆత్మలు. మధువనంలో అనుభవం చేసుకున్న ఆత్మలు కూడా ఏమంటారు? మధువనం అంటే సంగమయుగీ స్వర్గం అంటే మీరు స్వర్గ భూమిలో ఉండేవారు. ఇప్పుడు కూడా స్వర్గంలో ఉన్నారు మరియు భవిష్యత్తులో కూడా స్వర్గంలో ఉంటారు. డబల్ స్వర్గానికి అధికారులు. ఎంత విశేషంగా అయ్యారు. బాప్‌దాదా ఈరోజు విశేషంగా మధువన నివాసీయులను కలుసుకోవటానికి వచ్చారు. బాబా అడుగుతున్నారు- స్వర్గం యొక్క విశేషత లేదా స్వర్గం యొక్క మహిమ ఏమిటి? స్వర్గం యొక్క విశేష మహిమ సదా సంపన్నత అంటే స్వర్గం యొక్క ఖజానాలో అప్రాప్తి వస్తువు ఏదీ ఉండదు. సంగమయుగీ స్వర్గం మరియు భవిష్య స్వర్గం రెండింటికి ఒకే విశేష మహిమ ఉంది. మధువనం నివాసీయులు అంటే సంగమయుగీ స్వర్గ నివాసీయులు. ఇలా సంపన్న స్థితిని అనుభవం చేసుకుంటున్నారా? దీనితో మేము సదా తృప్తి ఆత్మలం అని అనుభవం అవుతుంది. కోరిక అంటే తెలియని స్థితి యొక్క సంస్కారం భవిష్య స్వర్గంలో స్వతహాగా ఉంటుంది అలాగే మధువన నివాసీయులకు ఈ సంస్కారం స్వతహాగా ఉందా? స్వర్గవాసీయులు అంటే ఈ అన్ని విషయాలలో స్వతహా,సంస్కార స్వరూపులుగా ఉన్నారా? ఎవరైనా మీరు ఎక్కడి నివాసీయులు అని అడిగితే చాలా సంతోషంతో, నిశ్చయంతో మేము మధువన నివాసీయులం అని చెప్తారు కదా! మధువన నివాసీయులు అని ఎలాగైతే ముద్ర పడిపోయిందో అలాగే స్థానంతో పాటూ స్థితికి కూడా ముద్ర పడాలి కదా! ఏదైనా చల్లని గదిలోకి వెళ్ళగానే అటువంటి స్థితి స్వతహాగానే వస్తుంది కదా! అలాగే మధువనానికి ఏదైతే మహిమ ఉందో అటువంటి సంస్కారం తయారయ్యిందా? సాకార రూపంలో లక్ష్య స్వరూపంగా అందరి ముందు మధువనం ఉంది. అందరు మధువనాన్నే కాపీ చేస్తారు. ఎవరి స్థితిలో అయినా అలజడి వస్తే అచంచల ఇల్లు (అచల్ ఘర్) అయిన మధువనమే జ్ఞాపకం వస్తుంది కదా!

Created by Universal Document Converter